పారిశుద్ధ్య కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయం


ఆందోళనలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఘట్‌కేసర్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 140 మందిని విధుల నుంచి కమిషనర్ తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. పారిశుద్ధ్య కార్మికుల తొలగింపుకు నిరసనగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట వారితో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఉదయం, సాయంత్రం రెండు పూటలా విధులు నిర్వాహించాలని, లేని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామని కమిషనర్ అనడం సమంజసం కాదన్నారు. కార్మికులను విధుల నుంచి తొలగించినట్లు కమిషనర్ ప్రకటించడంతో నిరసన చేపట్టామన్నారు. కౌన్సిల్ సభ్యులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నిరసనలో కార్మికులు నరసింహా, బాలకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అలుగు పారుతున్న పెద్ద చెరువు



మేడ్చల్: మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం, బుధవారం ఉదయం భారీ వర్షం పడడంతో ఉదయం వేళల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణంలోని చాలా కాలనీలు జలమయమయ్యాయి. అధికారులు వర్షం నీటిని పల్లపు ప్రాంతాలకు మరల్చి సమస్యలను తీర్చారు. ఇప్పటికే భారీ వర్షాలు కురియడంతో జలకళతో ఉన్న చెరువులు, కుంటలు బుధవారం కురిసిన వర్షంతో మరింత పూర్తిగా నిండాయి. మేడ్చల్ పెద్ద చెరువు అలుగులు పోసింది.

ఘనంగా స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ ఓరియంటేషన్ డే


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మైసమ్మగూడలో మల్లారెడ్డి యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ ఓరియంటేషన్ డేను బుధవారం నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆంజనేయులు, వైస్ ఛాన్స్‌లర్ వీఎస్‌కెరెడ్డి, ఐసీఎఆర్ ఏటీఏఆర్ఐ షేక్ ఎన్‌మిరాన్, డీన్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఊరు వెళ్లి వచ్చే సరికి చోరీ


ఇంటిలో చిందరవందరగా పడివున్న దుస్తులు

ఘట్‌కేసర్: దసరాకు సొంతూరుకు వెళ్లి వచ్చేలోపు ఇంటిలో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్‌లో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో నివసించే లకావత్ సంపత్ దసరాకు జనగాం జిల్లా రఘునాథపల్లి, గూడెంకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి వుండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడమే కాకుండా అందులోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే బీరువాను తనిఖీ చేయగా అందులో దాచిన రూ. 30 వేలు నగదు, 2 తులాల బంగారం కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షేమ పథకాలు అందజేయడానికే ఇందిరమ్మ కమిటీలు

మేడ్చల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలు ప్రజలకు అందజేయడానికి వారధిగా పని చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌లు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసి అర్హులు లబ్ధిపొందేలా ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయని అన్నారు. మండల నాయకులు సమావేశంలో నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నాయకుడు ప్రభాకర్‌గౌడ్, మండల, మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.

కాప్రా సబ్ రిజిస్ట్రార్‌గా వనజకుమారి

కాప్రా: స్టాంపులు–రిజిస్ట్రేషన్లశాఖ చేపట్టిన బదిలీల్లో భాగంగా కాప్రా సబ్ రిజిస్ట్రార్‌గా వనజకుమారి బాధ్యతలు చేపట్టనున్నారు. దూద్‌బౌలి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం కాప్రా సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.సతీష్‌కుమార్ దూద్‌బౌలికి బదిలీ కాగా.. మరో వైపు ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్‌గా మోసెస్ భాస్కర్ రానున్న విషయం తెలిసిందే. జులైలో జరిగిన బదిలీల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రెవెన్యూశాఖ విచారణ చేపట్టి తగిన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే పలువురు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

సమగ్ర కులగణనకు సిద్ధం

- సామాజిక సమగ్ర సర్వేకు యంత్రాంగం చర్యలు
- సర్వేతో జనాభా దామాషా ప్రకారం సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యం
- 2 నెలల్లో పూర్తయ్యేలా కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారుల్లో సమగ్ర కులగణన చేపట్టేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశగా మేడ్చల్ జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటంతో ఆయా వర్గాల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.

సమగ్ర వివరాల సేకరణ

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపర్చనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు.

రాజకీయ అవకాశాలు లభిస్తాయని..

- ప్రస్తుతం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుత మొత్తం జనాభాలో బీసీలు అధికంగా ఉంటారని తెలుస్తోంది. జిల్లాలో ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
- నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో రెండు నెలల పాటు జరిగే కుల గణన సర్వే కార్యక్రమంలో ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యూటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలు పెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.
- 2011జనాభా లెక్కల ప్రకారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం జనాభా 24,60,095 కాగా.. ఇందులో కుటుంబాల సంఖ్య (హౌజ్ హోల్డర్లు) 5,86,112 గా ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత 2014 సంవత్సరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించిన సందర్భంగా జిల్లాలో మొత్తం జనాభా 28,05,365 ఉండగా..ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు) 7,69,313 గా ఉంది. 2011 నుంచి 2014 వరకు దాదాపు నాలుగేళ్ల వ్యవధిలో జిల్లా జనాభా 3,45,270 పెరగగా..ఇందులో కుటుంబాల సంఖ్య(హౌజ్ హోల్డర్లు)1,71,201గా ఉంది.

◆ 2014లో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు ఇలా ఉన్నాయి.

సామాజిక వర్గం	కుటుంబాల సంఖ్య	జనాభా
ఓసీ	2,96,379	10,62,969
బీసీ	3,43,326	12,63,522
ఎస్సీ	1,08,174	3,99,572
ఎస్టీ	21,434	79,302
మొత్తం	7,69,313	28,05,365

మెయిన్స్ పరీక్షలకు హాల్ టికెట్లు రెడీ

గ్రూప్–1 పరీక్షలకు
3 జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు మొదటి పరీక్షకు ఉపయోగించిన హాల్ టికెట్‌ను మిగిలిన 6 పరీక్షలకు (ఈ నెల 21 నుంచి 27 వరకు) ఉపయోగించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు గుర్తించబడిన 46 కేంద్రాలలో ఈ నెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు.

- అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 1:30 గంటలకు మూసివేస్తారన్నారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని కలెక్టర్ స్పష్టంగా తెలిపారు.
- అభ్యర్థులు నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్–ఎరేజర్, హాల్ టికెట్‌పై అతికించిన ఫోటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డ్‌ని మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలన్నారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే రాయాలని సూచించారు.

అక్రమ కట్టడాలను సహించేదిలేదు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో సర్వే నెంబర్లు– 417, 420 లో బుధవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను సహించేదిలేదని, విద్యుత్, నీటి కనెక్షన్ ఇవ్వవద్దని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, కబ్జాదారుల పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: పర్యావరణం పచ్చదనాన్ని కాపాడుకుందామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం పరిశుభ్రత హైదరాబాద్ కార్యక్రమాన్ని డివిజన్‌లో ఆయన సర్కిల్ ఎఎమ్‌హెచ్ఓ డాక్టర్ కె.మంజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలు, మట్టికుప్పలు తొలగిస్తారన్నారు. ఎస్‌ఎండీసీ కాలనీ ప్రధాన రహదారి వెంట తరచూ వ్యర్థాలను పారబోస్తున్నారని, నిఘాను ఏర్పాటు చేసి జరిమానా విధించాలని సూచించారు. పర్యావరణం కాపాడుకోవడానికి పచ్చదనం కూడా అవసరమని ఇంటి పరిసరాల్లో చెట్లు పెంచడమే కాకుండా వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. ఎస్ఎస్ చింతల శ్రీనివాస్, జోనల్ అధికారి పద్మ ప్రియ, బాబు, సత్యనారాయణ, కిషోర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిరక్షించండి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్‌నగర్‌లో ఉన్న ఒకే పార్కును పక్క స్థలం వారు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ ఆదర్శ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. సర్వే నంబర్ 56 పార్కులో సుమారుగా 440 గజాలకు పైగా పార్కు స్థలం ఉందని, అది లేఅవుట్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. సర్వేనంబరులో పార్కు పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యక్తి ప్లాట్ నంబర్ 36 ఉందని, అట్టి యాజమాని తన స్థలంతో పాటు పార్కు స్థలాన్ని కూడా ఆక్రమిస్తూ.. ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని వెంటనే పనులు నిలిపేసి పార్కు స్థలం కబ్జా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కును కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ముత్యంరెడ్డినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ ముత్యంరెడ్డినగర్‌లో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి బుధవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాల ఏర్పాటు, కుక్కల బెడద నుంచి కాపాడాలని, పార్కుల్లో వ్యర్థాలను తొలగించాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు ఉపయోగపడేలా శుభ్రం చేయాలని ఆమె కోరారు. నాయకులు మల్లేష్‌గౌడ్, యాదగిరిగౌడ్, శరన్‌గిరి, జావిద్, కాలనీవాసులు ఎస్ఎన్.ఆంథోని, రాజేష్ కుమార్, రామకృష్ణ, సాయికిరణ్, ప్రవీణ్‌కుమార్, రమణాచారి, అను, సునీత, ఎస్ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీగా మాల ప్రొఫెసర్‌ను నియమించండి

ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షుడుఅంగిరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో జరిగిన అంసా సమావేశంలో వారు మాట్లాడుతూ ఓయూను ప్రారంభించేందుకు రెండు వేల ఎకరాల భూమిని దానం ఇచ్చిన లఖాభాయ్ చందా కూడా మాల సామాజిక వర్గానికి చెందిన మహిళ అని గుర్తు చేశారు. కానీ, 107 ఏళ్ల ఓయూ చరిత్రలో ఇంతవరకు ఎస్సీలకు వీసీ పదవి దక్కకపోవడం శోచనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓయూ చరిత్రను పూర్తిగా అధ్యయనం చేసి మాల అధ్యాపకులకు వీసీగా అవకాశం ఇవ్వాలన్నారు.

నేడు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈ నెల 17న ఘట్కేసర్ మండలంలోని ఏదులాబాద్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల లలిత కళల పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని గురువారం ఉదయం 9.30 గంటలకు సంబంధిత పాఠశాలలో రిపోర్ట్ చేసి, జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని సూచించారు.

చెత్త తొలగింపునకు స్పెషల్ డ్రైవ్


స్వచ్ఛత కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తదితరులు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని చంద్రగిరి కాలనీలో పరిశుభ్ర హైదరాబాద్ – వ్యర్థాల తొలగింపు పేరుతో 21 రోజుల ప్రత్యేక కార్యచరణ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ మంజులతో కలిసి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఎఫ్ఏ ఊర్మిళ, కాలనీవాసులు గౌలికార్ రవీందర్, గౌలికర్ ఆనంద్, సూర్య నగర్ అధ్యక్షులు సాయినాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి


జలమండలి జీఎంకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జేఎల్ఎస్ఎస్‌నగర్, రామాంజనేయనగర్, హిల్‌టాప్ కాలనీ, పలు కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు, కాలనీవాసులు బుధవారం జలమండలి జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



గౌతంనగర్: గౌతంనగర్ చౌరస్తాలో బీజేపీ సాధారణ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ హాజరై మాట్లాడుతూ.. బీజేపీలో సభ్యత్వం తీసుకోవడం, బీజేపీని, దేశాన్ని బలపర్చడమేనన్నారు. డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, వాసంశెట్టి శ్రీనివాస్, సాయిబాబా, వెంకట్‌యాదవ్, బలరాం, అమర్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా బాధితులకు అండగా ఉంటాం


ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి

కాప్రా: నగరంలో హైడ్రా బాధితులకు అండగా ఉంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ, హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారని, బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ టీమ్ అందుబాటులో ఉంటుందన్నారు. హైడ్రా, మూసీ బాధితుల కోసం లీగల్ సాయం కోసం తెలంగాణ భవన్‌లో న్యాయవాదుల బృందం అందుబాటులో ఉంచుతున్నట్లు కేటీఆర్ తెలిపినట్లు ఎమ్మెల్యే వివరించారు.

స్వచ్ఛతపై సమీక్ష సమావేశం

ఉప్పల్: చిలుకానగర్‌ను చెత్త రహిత డివిజన్‌గా మార్చేందుకు మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్ ఉప్పల్ సర్కిల్ శానిటరీ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం వార్డు కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జీవీపీ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ అసోసియేషన్లు ముందుకు వస్తున్నట్లు వివరించారు. వారి సహకారంతోనే సీసీ కెమెరాలను అమర్చుకుందాం అని పిలుపునిచ్చారు. శానిటరీ సిబ్బంది ఎలాంటి అలసత్వం లేకుండా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. బన్నాల ప్రవీణ్, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ బన్నాల గీత

ప్రొఫెసర్ పురుషోత్తం నియామకంపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా ఓయూ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకంపట్ల తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఓయూ రీసెర్చ్ స్కాలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వలిగొండ నరసింహ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. దళిత బహుజన సామాజిక వర్గానికి చెందిన పురుషోత్తం పొలిటికల్ జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పురుషోత్తం సేవలను గుర్తించి వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వలిగొండ నరసింహ పేర్కొన్నారు.

పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం..

మల్కాజిగిరి: మల్కాజిగిరి బాలికల పాఠశాల ఆవరణలో పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో పాఠశాల మెయిన్‌గేట్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో తాగుబోతులు, పోకిరీలు మద్యం సేవించి ఇబ్బంది పెట్టేవారన్నారు. ప్రస్తుతం ఆ ప్రదేశంలో సీసీరోడ్ల నిర్మాణం, ప్రహరీతో పాటు మొక్కలు నాటుతామని, పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఈఈ లక్ష్మణ్, ఏఈ నవీన్, వీఐ రమేష్, ఉపాధ్యాయురాలు సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కాలేజీలోని ఎంకాం, ఎంకాం(ఐఎస్) నాల్గో సెమిస్టర్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 90 శాతం మంది విద్యార్థులు డెలాయిట్, యూఎస్ కన్సల్టెంట్లుగా రూ.7.6 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించిన్నట్లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను తన కార్యలయంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అభినందించారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that our client Smt. Ragam VARALAXMI, W/o. Sri Ragam Gopal, age 39 years, Occ: Hw, R/o. H. No. 5-8-113, Plot No.65 Krishna Nagar Colony Moula-Ali Medchal-Malkajgiri District, TS-340 Aadhar No. 2154 1290 5868, had entered into an Agreement of Sale with [1]. Sri. Kamakanti VEERA BHADRAIAH S/o. Late K. Veeraiah, age 65 years Occ: Carpenter R/o. H. No. 28-15/34 Vinobha Nagar Colony, Neredmet, Sainikpuri-062, Aadhar No 5808 0370 4785 and [2]. Smt. Swamulapally VEENA KUMARI D/o. Kamakanti VEERA BHADRAIAH W/o. S. Srinivas Chary, age 36 years, Occ: H/w, R/o. H. No. 11-2-47/7, Shivaji Nagar, Siddipet-502103, Aadhar No. 6823 2737 0791 that the Open Plot No 67 adm 200.0 Sq. Yds, OR 167.2 Sq. Mtrs, in Survey Nos 224 A&B, and 230 A&B, situated at Rampally [V&GP], Keesara (M), Medchal-Malkajgiri Dist. through Original Sale Deed Nos. 7506/1994 dt. 10-11-1994 and 7491/2018 dt. 21-06-2018, and bounded by: NORTH: Plot No. 66; SOUTH: Plot No. 68; EAST: 30' Road; WEST: Plot No. 139; (Hereinafter referred to as 'SCHEDULE OF PROPERTY') and our client had paid substantial amount towards advance of sale consideration to [1]. Sri. Kamakanti VEERA BHADRAIAH S/o. Late K. Veeraiah and [2]. Smt. Swamulapally VEENA KUMARI D/o. Kamakanti VEERA BHADRAIAH W/o. S. Srinivas Chary. The General public are hereby informed that our client would proceed with the said transaction. If any individual or institution has got any right or claim over the property may contact the undersigned within a period of TEN [10] days from today, failing which our client will proceed with the registration of Schedule of Property on terms of Agreement of Sale and no claims of whatsoever shall be entertained.

K. VENKATA CHARY & K. SRI DEVI GAYATHRI
Advocates.
[illegible]

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387